క్లుప్తంగా

వలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శం



వేమూరు: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా గ్రామ సచివాలయ వలంటీర్లు పని చేస్తున్నారని నియోజకవర్గ సమన్వయ కర్త వరికూటి అశోక్‌బాబు తెలిపారు.మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా పురస్కారాలు పొందిన వలంటీర్లను ఘనంగా సన్మానించారు. వలంటీర్లు వేమూరి అంజలి, అరమళ్ల సునీత, పులి అనంద్, సిద్దార్థ, చాట్రగడ్డ మమతలకు సేవారత్న అవార్డులు, మిగిలిన వలంటీర్లకు సేవామిత్ర అవార్డులు అందజేశారు.ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని ప్రజలకు అందజేసేలా వలంటీర్లు పని చేస్తున్నారన్నారు. వలంటీర్లు సేవలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి అవార్డులు అందజేయడం జరుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహన్, మండల పార్టీ అధ్యక్షులు బొల్లిముంత ఏడుకొండలు, సొసైటీ అధ్యక్షుడు గాజుల భానుప్రకాశ్, కోఆప్షన్ మెంబరు తలతోటి సువర్ణరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు దాసరి శివపార్వతి, మాజీ జెడ్పీటీసీ విష్ణుమొలకల వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ దాసరి రమేష్, ఎంపీడీవో చంద్రశేఖర్, వలంటీర్లు పాల్గొన్నారు.

బాపట్ల డీఎస్పీగా మురళీకృష్ణ బాధ్యతల స్వీకారం



బాపట్లటౌన్: ఎన్నికల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ సీహెచ్.మురళీకృష్ణ హెచ్చరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా బాపట్ల డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న టి.వెంకటేశులు ను ఎన్‌టిఆర్ జిల్లాకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. బాపట్ల డీఎస్పీగా నియమించిన సీహెచ్.మురళీకృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. తొలుత పట్టణంలోని సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత శ్రీ క్షీరభావన్నారాయణ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండల కేంద్రంలో మైనార్టీ ముస్లింలు శనివారం నియోజక వర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ముస్లీం మైనార్టీ జోనల్ ఇన్‌చార్జి షేక్ ఇమామ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. హుస్సేన్ ఆధ్వర్యంలో 20 కుటుంబాలు, ఇంటూరు గ్రామం నుంచి 7 కుటుంబాలు వెరసి 27 కుటుంబాలు పార్టీలో చేరాయి. వరికూటి అశోక్‌బాబు పార్టీ కండువా వేసి వీరిని స్వాగతించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలో ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ఓ వ్యక్తి శనివారం 11 క్వార్టరు సీసాల మద్యం కొనుగోలు చేసి వెళుతుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

ఆటో,లారీ ఢీ: ముగ్గురికి గాయాలు

తెనాలిరూరల్: ఆటోను లారీ ఢీ కొట్టిన ఘటనలో ముగ్గురు గాయాలపాలయ్యారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి మండలం పెదరావూరు ప్రధాన కూడలి వద్ద శుక్రవారం రాత్రి తెనాలి వైపు వస్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో బోల్తా పడడంతో అందులోని ముగ్గురు గాయాలపాలయ్యారు. క్షతగాత్రలను 108లో తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ పి. కోటేశ్వరరావు తెలిపారు.

సీఎం జగన్ పాలనలో బలహీన వర్గాలకు న్యాయం

వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు



అనంతవరంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న వరికూటి అశోక్‌బాబు

కొల్లూరు : బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రతి ఇంటి సమస్యలను పరిష్కరించడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల మద్దతు దక్కిందని వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. మండలంలోని అనంతవరంలో పర్యటించిన ఆయన ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లి వృద్ధులు, వికలాంగులతో మాట్లాడారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఫించన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాలు అందుతున్న విధానంపై ఆరా తీశారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు పట్ల ప్రజల నుంచి సంతృప్తి వ్యక్తమయ్యింది. పలువురు మహిళలు తమకు ఇళ్ల స్థలాలు మంజూరు కాలేదని ఆయన దృష్టికి తీసుకురావడంతో వారికి ఇళ్ల స్థలాలు మంజూరు కాకపోవడానికి గల కారణాలను ఆరా తీశారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయిస్తానని ఆందోళన చెందాల్సిన పని లేదని భరోసా కల్పించారు. ప్రజల నుంచి ప్రతి సమస్యను సావధానంగా అడిగి తెలుసుకున్న ఆయన అధికారులను తక్షణం ప్రజా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. జగనన్న కాలనీని పరిశీలించిన ఆయన కాలనీలో తక్షణం మెరకలు తోలించి, లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని హౌసింగ్, పంచాయతీ యంత్రాంగానికి సూచించారు. గ్రామంలో ఎస్సీ స్మశాన వాటికకు అదనంగా స్థలం కేటాయించాలని అర్జీ అందజేయడంతో స్పందించిన ఆయన సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్మశాన స్థలాలు కేటాయింపుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించారని శ్మశానానికి స్థల సేకరణ చేపట్టడం జరుగుతుందని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబాన్ని సంక్షేమ పథకాల రూపంలో రాజకీయాలకు అతీతంగా ఆదుకుంటున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు అమిరిశెట్టి శ్రీధర్, బుల్లా నవరత్నం, కోఆప్షన్ సభ్యుడు షేక్ బాజి, సర్పంచ్‌లు సూరపనేని వెంకటేశ్వరరావు, సనక వెంకట్రావు, మేకతోటి శ్రీకాంత్, భూపతి కిశోర్, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ అయిల సుబ్బారావు, స్థానిక నాయకులు ధూళిపాళ్ల రాంబాబు, మేడికొండ రమేష్ పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం బలోపేతానికి ఓటు కీలకం



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

భట్టిప్రోలు: ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని ప్రతి ఒక్కరూ తమ ఓటును ప్రలోభాలకు గురి కాకుండా నిర్భయంగా వినియోగించుకోవాలని తహసీల్దార్ సీహెచ్ పద్మావతి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువను తెలియజేసేందుకు శనివారం తహసీల్దార్ పద్మావతి ఆధ్వర్యంలో భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్ విద్యార్థులు 'సిస్టమ్యాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్' (ఎస్‌వీఈఈపీ) పేరిట అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పద్మావతి మాట్లాడుతూ చాలా మంది ఓటును కేవలం రాజకీయ తంతుగా భావిస్తున్నారని అన్నారు. ఓటును వినియోగించటం ద్వారా ప్రజాస్వామ్యం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. విద్యార్థులు పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. నినాదాలు చేస్తూ బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. అంతకు ముందు భట్టిప్రోలు గ్రామ సచివాలయంలో వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు రూపొందించిన ఈవీఎం మిషన్‌తో ఎలక్షన్ మాస్టర్ ట్రైనర్ గుర్రం మొరళీమోహన్ డెమో ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ కె. శ్రీనివాసరావు, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంఈవో-2 నీలం దేవరాజు, ప్రధానోపాధ్యాయులు సీహెచ్ రామకోటేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఆర్ఐ శివరామకృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ శేతు రామచంద్రరరావు, సీనియర్ అసిస్టెంట్ పరిశుద్ధరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



ఆలయంలో స్వామివార్ల విగ్రహ మూర్తులు

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో నూతనంగా నిర్మించిన సీతా, లక్ష్మణ, హనుమత్ సమేత శ్రీ రామ చంద్రస్వామివారి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్టా కుంభాభిషేక మహోత్సవాలలో భాగంగా శనివారం విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం వైభవంగా జరిగింది. ఉదయం సీతారామ కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. సీతా రామాలయ కమిటీ ఆధ్వర్యంలో తిరుమల, తిరుపతి దేవస్థానం శ్రీవారి పథకం ద్వారా మంజూరైన రూ.10 లక్షలతో పాటు దాతల విరాళాలతో దేవాలయ పునర్మిణాన్ని చేపట్టారు. కార్యక్రమాలను బద్వేలుకు చెందిన వైదికులు అయలావర్జుల రామకృష్ణశాస్త్రి, నాగరాజశర్మ, శివకుమార్ శాస్త్రి శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను శ్రీ సీతారామాలయ కమిటీ దేవాలయ ట్రస్టీ కుందేటి రామకోటి నరసింహారావు పర్యవేక్షించారు.

సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ విజయానికి వెన్నెముక

కొల్లూరు : పేద వర్గాల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి వెన్నెముకలా నిలవనున్నాయని వేమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. శనివారం రాత్రి మండలంలోని పెసర్లంకలో పల్లెయాత్ర కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ పర్యటించి సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు సుగ్గున అశోక్, సర్పంచ్‌లు సనక వెంకట్రావు, గొల్లపూడి సుబ్బారావు, మండల యూత్ కన్వీనర్ సింగం కృష్ణప్రసాద్, గ్రామ సచివాలయ కన్వీనర్ కూరేటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ముస్లింలు గుణపాఠం చెబుతారు



మాట్లాడుతున్న కోఆప్షన్ సభ్యుడు అమీర్‌బేగ్

కర్లపాలెం: రాష్ట్రంలో ఉన్న ముస్లింలను టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు మోసం చేస్తున్నారని కర్లపాలెం మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎండీ అమీర్‌బేగ్ మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ శనివారం తెలుగుదేశం, జనసేన పార్టీలు ప్రకటించిన అసెంబ్లీ అభ్యర్థులలో ముస్లింలకు సంబంధించి ఒక్క సీటీ కేటాయించటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నాలుగు శాతం మాత్రమే ఉన్న తన సొంత ఖమ్మ కులానికి 21 సీట్లు కేటాయించి 17 శాతం ఉన్న ముస్లింలకు ఒక సీటు కేటాయించి చంద్రబాబునాయుడు ముస్లింలను మోసం చేశారని చెప్పారు. ఇప్పటికైనా ముస్లింలంతా చంద్రబాబు చేస్తున్న మోసాన్ని గుర్తించి తెలుగుదేశం పార్టీకి రాజీనామాలు చేసి సామాజిక న్యాయం పాటిస్తున్న వైఎస్సార్‌సీపీలో చేరాలని కోరారు. రానున్న ఎన్నికలలో ముస్లింలు తెలుగుదేశం పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని అమీర్‌బేగ్ హెచ్చరించారు.

'ఇండ్ గ్యాప్' సర్టిఫికేషన్‌కు పంట నమూనాల సేకరణ



పసుపు పంట నమూనాలను సేకరిస్తున్న డాక్టర్ ఎం.ప్రతాపరెడ్డి

తెనాలి: శ్రేష్టమైన వ్యవసాయ పద్ధతులతో పండించిన పంటలకు 'ఇండ్ గ్యాప్' సర్టిఫికేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని మండల కేంద్రమైన కొల్లిపరలోని శ్రేష్ట రైతు ఉత్పత్తిదారుల సంఘం అందిపుచ్చుకుంది. తొలిసారిగా సంఘ సభ్యులు మంచి వ్యవసాయ పద్ధతులతో పండించిన పసుపు పంటకు ఇండ్ గ్యాప్ సర్టిఫికేషన్ ఇప్పించేందుకు తొలి అడుగు వేసింది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ ఏజెన్సీ (ఏపీఎస్‌ఓపీసీఏ) శనివారం కొల్లిపరలో పసుపు పంట నమూనాలను సేకరించింది. ఉద్యాన అధికారులు, రైతుల సమక్షంలో మొత్తం 24 మంది రైతుల పొలాల్లోని పసుపు నమూనాలను ఏజెన్సీ ఎక్స్‌టెర్నల్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ ఎం.ప్రతాపరెడ్డి సేకరించారు. ఎలాంటి అవశేషాలు లేని పసుపు నమూనాలకు ఇండ్ గ్యాప్ సర్టిఫికేషన్ లభిస్తుందని జిల్లా ఉద్యాన అధికారి బి.రవీంద్రబాబు వెల్లడించారు. ఈ సర్టిఫికేషన్ లభించిన పంటలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందని అన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

కమిషనర్ రామచంద్రారెడ్డి



బాపట్ల: బాపట్ల పట్టణంలోని పారిశుద్ధ్యంపై ప్రత్యేక యాక్షన్ ప్లాన్ చేపట్టామని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులపై ఆకస్మిక తనిఖీలను శనివారం చేపట్టారు. పారిశుద్ధ్య సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ నజీర్, శ్రీనివాసరావు ఉన్నారు.

మహిళలు స్వయం ఉపాధి పొందాలి

కర్లపాలెం: డ్వాక్రా మహిళలు చిరు వ్యాపారాలతో జీవనోపాధి మెరుగు పరుచుకోవాలని బాపట్ల ఏరియా కోఆర్డినేటర్ యు.సుబ్బారావు తెలిపారు. స్థానిక వైఎస్సార్ వెలుగు కార్యాలయంలో జరిగిన డ్వాక్రా మహిళల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సీఎం జగన్ మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసరెడ్డి, సీసీలు పూర్ణచంద్రరావు, శివకోటేశ్వరి, మండల సమైఖ్య కార్యదర్శి నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ఆర్యవైశ్యులు

వేమూరు: వైఎస్సార్‌సీపీకి ఆర్య వైశ్యుల సహకారం పూర్తిగా ఉంటుందని కొణిజేటి శివ సుబ్బారావు తెలిపారు. వేమూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త వరికూటి అశోక్‌బాబును మర్యాద పూర్వకంగా కలిశారు. శివ సుబ్బారావు మాట్లాడుతూ దివంగనేత, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య ఆర్య వైశ్యులకు అనేక సేవలు అందించడం జరిగిందన్నారు. అదే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆర్య వైశ్యులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అందువల్ల ఆర్య వైశ్యుల సహకారం పూర్తిగా వైఎస్సార్‌సీపీకి ఉంటుందని స్పష్టం చేశారు.

సొసైటీలకు పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలి

భట్టిప్రోలు: చేనేత సహకార సంఘాలకు తక్షణమే పాలక వర్గ ఎన్నికలు నిర్వహించి వాటి మనుగడను కాపాడి కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని దస్తకార్ ఆంధ్ర మార్కెటింగ్ అసోసియేషన్ ప్రతినిధి బి.శ్యామ సుందరి పేర్కొన్నారు. భట్టిప్రోలు రైలుపేట సొసైటీలో శనివారం 'సొసైటీల భవిష్యత్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఏర్పాటు చేసిన సొసైటీలకు గత ఐదేళ్లగా ఎన్నికలు నిర్వహించకపోవడంతో వాటి మనుగడ ప్రశ్నార్ధకంగా మారిందన్నారు. సొసైటీలకు ఎన్నికలు నిర్వహించి నిల్వ ఉన్న వస్త్రాలను ఆప్కో ద్వారా కొనుగోలు చేసి బకాయిలు చెల్లించాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధి జి.రవీందర్, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయక కార్యదర్శి జి.బాలాజీ, జిల్లా నాయకులు ఎం. సత్యన్నారాయణ, చేనేత ప్రతినిధులు పి. మల్లిఖార్జునరావు, బి. సుబ్బారావు, సీహెచ్ శ్రీరంగం, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న ఆర్డీవో హెలా షారోన్



సమావేశానికి హాజరైన బీఎల్వోలు

- నోటిఫికేషన్ వెలువడే లోపు తుది ఓటరు జాబితాలు సిద్ధం చేయాలి
- బీఎల్వోల సమావేశంలో ఆర్డీవో హెలా షారోన్

రేపల్లె రూరల్: ఎన్నికల విధుల్లో అలసత్వం వహించకుండా బాధ్యతాయుతంగా పని చేయాలని ఆర్డీవో హెలా షారోన్ సూచించారు. ఓటర్ల జాబితా అంశంపై నియోజకవర్గంలోని బీఎల్వోలతో పట్టణంలోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్నందున నిబద్ధతతో పని చేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బీఎల్వోలు తమ పరిధిలోని ఓటరు జాబితాలను నిశితంగా పరిశీలించి తప్పొప్పులు సరి చేయాలన్నారు. సమావేశాలకు హాజరు కాకుండా విధుల్లో నిర్లక్ష్యం వహించే బీఎల్వోలకు నోటీసులు జారీ చేయాలని తహసీల్దార్‌లను ఆదేశించారు. జాబితాలను తరచూ సరిచేసి ప్రచురిస్తున్న మళ్లీ తప్పులు ఎందుకు దొర్లుతున్నాయని సిబ్బందిని ప్రశ్నించారు. జాబితాలోని తప్పొప్పుల సవరణలపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. తమ పరిధిలో ఓటర్ల జాబితాలో వివరాలు సక్రమంగా నమోదు చేయని బీఎల్వోలపై కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే లోపు తప్పులు లేని జాబితాలను ప్రకటించే దిశగా పని చేయాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ చొప్ప రవీంద్ర, మున్సిపల్ కమిషనర్ రామభోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బూరుగులమ్మ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న బూరుగలమ్మ

రేపల్లె రూరల్: మాఘపౌర్ణమిని పురస్కరించుకుని ఓల్డ్‌టౌన్‌లో వేంచేసి యున్న గ్రామదేవత శ్రీ బూరుగలమ్మ తిరునాళ్లను వైభవంగా నిర్వహించారు. శనివారం అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా వేకువ జాము నుంచి సుప్రభాత సేవ, పంచామృతాలు, పండ్లరసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అఖండ దీప స్థాపన, సద్ది నైవేద్యాల సమర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తిలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ఆవరణంలో భక్తులు ఏర్పాటు చేసిన ప్రభ చూపరులను ఆకట్టుకుంది. సాయంత్రం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు.